# అబద్ధం అధికారం

అబద్ధం జనాభాలెక్కల ప్రకారం, ఆ వూరి ఎలిమెంటరీస్కూల్ అడ్మిషన్ రిజిష్టరు ప్రకారం, ఓటర్ల లిస్టుప్రకారం ఆ వూళ్ళోని పురుషుల దృష్టిలోను, వాళ్ళమ్మ నాగమ్మ దృష్టిలోను పదహారణాల పురుషుడు.

కాని నాగమ్మ ఇంటిముందున్న నూతిదగ్గరకొచ్చి నీళ్ళు తోడుకు వెళ్ళే ఆడవాళ్ళ దృష్టిలోమాత్రం, అబద్ధం అంతపెద్ద మగాడికింద లెక్కకాదు. అతగాడికి ఊహ వచ్చినప్పటినుంచి పొద్దున్నే లేచి ఓ వేపపుల్ల నోట్లోపెట్టుకొని, ఆ నూతిచప్టా అంచున కూర్చోవడంతో, రోజూ అక్కడికి నీళ్ళకొచ్చే ఆడంగులు కొత్తలో ఇబ్బందిపడినా రానురాను అతన్ని పట్టించుకోవడం మానేశారు. అతనిముందే స్నానంచేసి తడిబట్టలతో బిందెలు చంకనెత్తుకొని పోవడం, బట్టలు పిండుకుని ఆరవేసుకోవడం మామూలైపోయింది వాళ్ళకి. అబద్ధానికి మీసాలొచ్చినా అదే అలవాటయిపోయింది వాళ్ళందరికీ.

అబద్ధానికి మీసాలొచ్చినా, చిన్నప్పటిలాగే కాకీలాగు, గుండెలమీద రోమాలు ఒత్తుగా పెరిగినా బనీనుకూడా ఎరగని ఛాతీ చూసి,కొంతమంది పిచ్చిముండావా డనుకొనేవారు. తోటివాళ్ళలా పొలంవెళ్ళక, పనీపాటు లేకుండా ఇంటిపట్టునే ముప్పొద్దులా తిని కూర్చొని, తనకంటే చిన్నవాళ్ళతో గూటిబిల్ల, ఆకొట అడ్డం చూసి, తోటివాళ్ళు ఆట

పట్టించేవా రప్పుడప్పుడు. కాని నాగమ్మ నోటికి దడిసి మితిమీరిపోకుండా తగ్గేవారు.

అసలు అతగాడికి అబద్ధం పేరెందుకొచ్చిందో తెలిస్తే అతనలా ఎందుకయ్యాడో తెలుస్తుంది.

నాగమ్మకి వరసని నాలుగు కానుపులు పురిటిగదిలోనే రాలిపోడంతో, అయిదోసారి 'యీ కానుపూ అబద్ధమే' అని నాగమ్మా అనుకుంది. చుట్టు పక్కలవాళ్ళూ అనుకున్నారు. 'ఇదీ అబద్ధమే ఇదీ అబద్ధమే' అనుకుంటూ వుండగానే అబద్ధం పుట్టాడు. నాగమ్మే కీడు పోతుందని పుట్టగానే 'అబద్ధం' అని పిలిచింది. అంతా అలాగే పిల్చారు. కాని అబద్ధం నిబద్ధెయిపోయాడు. కాని పాపం అబద్ధం తండ్రి అబద్ధంపుట్టిన ఏడాదికల్లా, అబద్ధం అయిపోయాడు.

పాతికెకరాల మాగాణి, ఏనుగు స్తంభాల మండువాలోగిలి నాగమ్మ కప్పజెప్పి వంటరిదాన్ని చేసి పోయాడు.

దాంతో నాగమ్మ అబద్ధాన్ని, ఆ ఆస్తిని పెట్టుకొని రోజులు దొర్లించుకొస్తోంది. అబద్ధాన్ని కంటికి రెప్పలా కాసుకుంటూ, పొలం వెళ్ళనివ్వకుండా, ఓసారి మాష్టరు ఏదో అన్నాడని చదువుకూడా మానిపించేసి, అన్ని పనులు పైలకాపులచేతే నడిపించుకుంటూ అబద్ధాన్ని పెంచుకొస్తోంది. దాంతో పుష్కలమైన తిండితో వళ్ళు పెరిగిందిగాని, ఏపనీ లేకపోవడంతో మెదడు పెరగలేదు అబద్ధానికి—అందరి దృష్టిలోనూ ఎందుకూ పనికిరాని వాడులా తయారయ్యాడు.

అటువంటి అబద్ధం ఆ ఊరి ప్రెసిడెంటు పట్టన్న దృష్టిలో పడడంతో లక్షాధికారి వేలినున్న గిల్టు ఉంగరంలాగ విలువ పెరిగిపోయాడు.

పట్టన్న ఆ వూళ్ళో పంచాయతీ పుట్టినప్పటినుంచి దాన్ని గుట్టుగా ఏలుకొంటున్నాడు. దైవోర్పు ఇవ్వాల్సిన పరిస్థితు లొచ్చినా, నాలుగు రాళ్ళు చిమ్మి, మళ్ళీ అదుపులో పెట్టుకుంటున్నాడు. అంత చాకచక్యం గల మనిషి. కూతురు తాయారు పెళ్ళి విషయం వచ్చేసరికి చిత్తుగా

దెబ్బతింటున్నాడు. ఎన్ని సంబంధాలు తను చాకచక్యంగా తెచ్చినా తాయారుని చూడగానే జారుకుంటున్నాయి. ఆ తల్లి ఆకారం అలాంటిది. పొరబాటున ఎప్పుడేనా సింహద్వారం ముందు తాయారొచ్చి నిలబడితే పట్టన్న లోపలి కెళ్ళాలన్నా 'కాస్త తప్పుకో అమ్మడూ' అంటేగాని దారి దొరకదు. దానికి సాయం తాయారు మాట్లాడితే దొడ్లోఉన్న గొడ్లు బెదురుతాయి. అటువంటి తాయారుకి ఓ మొగుడ్ని వెతకడంతో పట్టన్న ఓడిపోవడంతో, అతని దృష్టి అబద్ధంమీద పడింది. నాగమ్మ నోరు మంచిదికాదని తెలిసినా, తన రాజకీయ చతురత ముందు, ఆ స్త్రీముందు నాగమ్మేంపాటిదిలే అని గుండె గట్టిచేసుకుని, గుమాస్తా కైలాసం పంతుల్ని రాయబారానికి పంపించాడు పట్టన్న నాగమ్మ దగ్గరికి.

నాగమ్మ గొంతాలమ్మ కోరికలు కోరింది. అన్నింటికి పంతులు సరేనని మాటిచ్చాడు.

మొత్తానికి తాయారుకి-అబద్ధానికి దిక్కులు పిక్కటిల్లేలా— పల్లకీ మోసిన చాకలాళ్ళ భుజాలు వాచిపోయేలా పెళ్ళిజరిగిపోయింది.

అంతే. ఆ దెబ్బతో 'అబద్ధం' పేరు జనం పలకడం మానేశారు.

పాతికేళ్ళ అబద్ధాన్ని తాయారు మొగుడనో, పట్టన్న అల్లుడనో, ప్రెసిడెంటుగారి అల్లుడనో అనేవారేగాని 'అబద్ధం'అని నోరారా ఎవ్వరూ పిలవడంలేదు. అసలా విషయాన్ని అబద్ధం పట్టించుకోలేదు. పెళ్ళికి పెట్టిన జరీపంచీలు సిల్కుచొక్కాలు వేసుకొంటూ, మనుగుడుపులు తింటూ, పెద్ద పందిరిమంచంమీద తాయారూ తనూ ఏదో సర్దుకు పడు కుంటూ రోజులు దొర్లించేస్తూ, బుద్ధిగా బతికేస్తున్నాడు.

రెండాస్తులకి అధిపతయ్యాడు. వాడికేంలే అని నాగమ్మ అంతగా ఏ విషయమూ పట్టించుకోలేదు.

అయితే తాయారు ఆడమనసు మాత్రం తన భర్తకి పేరూ ఊరూ లేకపోవడం సహించలేకపోయింది. అంతపేరుగల తండ్రికి కూతురై వుండి, తన భర్తకి పేరు లేకపోవడం తలకొట్టేసినట్టయి, తండ్రి ముందు ఫిర్యాదుచేసింది తాయారు ఓనాడు.

[library stamp]



# అబద్ధం అధికారం

ఆనాడు పట్టన్న నిద్రపోయిలేచి నర్సారావుపేట కుర్చీలో నడుం వాల్చి పేపరు చూస్తున్నాడు. తాయారు, పక్కనున్న స్టూలుమీద ఫలహారం ప్లేటుపెట్టి "టిఫిన్ తీసుకో నాన్నా" అంది. పట్టన్న నెమ్మదిగా టిఫిను తీసుకుంటున్నాడు. తాయారు మొదలుపెట్టింది.

"నాన్నా!"

"ఏమిటమ్మా?"

"నాకిదేం బాగోలేదు నాన్నా!"

"అసలు సంగతేమిటమ్మా?"

"అదే నాన్నా! ఆయన వీధిలోకెడితే అందరూ అనేమాట..."

"ఏమంటున్నారేం?"

"తాయారు మొగుడనో. ప్రెసిడెంటు పట్టన్న అల్లుడనో, నాగమ్మ కొడుకనో అంటున్నారు నాన్నా?"

"ఔనుమరి. అందులో అబద్ధ మేముంది?"

"అదేమిటి నాన్నా! నువ్వూ అట్లాగే అంటావు? అయితే నా మొగుడుకి వూరూ పేరూ లేదా?"

"ఓస్. అదా నీ గొడవ. పేరు లేకేమమ్మా. ఊళ్ళోవాళ్ళు పిలవక పోతే మనం ఏం చేస్తాం చెప్పు."

"ఏదోఒకటి చెయ్యాలి. లేకపోతే నేను నీతో మాట్లాడనంతే" అని కళ్ళ నీరు పెట్టుకుంది తయారు అమాయకంగా.

ఒక్కగానొక్క కూతురు కంటతడిపెడితే చూడలేక ప్రెసిడెంటు పట్టన్న "నన్నేమి చెయ్యమంటావో చెప్పమ్మా. నువ్వలా ఇదయితే నేను చూడలేను" అని బతిమాలాడు.

"రేపు రాబోయే ఎలక్షనులో ఆయన్ని మనూరికి ప్రెసిడెంటుని చెయ్యి."

"అదెలాగమ్మా! ప్రెసిడెంటు కావడం అంటే మాటలా? తక్కిన మెంబర్లంతా వప్పుకోవద్దూ? అసలు అబద్ధం మెంబరుగా నెగ్గొద్దూ?"

"ఎందుకు నెగ్గడూ. ఓటుకి ఐదు రూపాయిలిచ్చి కాదేవిటి నువ్వు నెంబరౌత. ఆలాగే ఆయనాను."

"అదిసరేలే, మెంబరయ్యాడనుకో. తతిమ్మా మెంబర్లు ఇతగాడ్ని ప్రెసిడెంటు కానిస్తారా ?"

"ఎందుకు కానివ్వరేమిటి ? ఓటుకి అయిదు రూపాయలయితే, మెంబరు ఓటుకి వెయ్యిరూపాయలు, కాకపోతే మరో వెయ్యి. ప్రెసిడెంటుగారి భార్య ననిపించుకోవాలని నాకుమాత్రం వుండదేమిటి?" అంది గోముగా తాయారు.

పట్టన్న కూతురిమాట కాదనలేకపోయాడు. "సరేలేమ్మా. అలాగే చేదాం" అని కూతురికి మాటిచ్చేశాడు.

ఎలక్షనులు రానేవచ్చాయి. పట్టన్న తన వార్డులోనే అబద్ధాన్ని నిలబెట్టి ఓటర్ల కాళ్ళావేళ్ళాపడి, నచ్చచెప్పి, బతిమాలి అల్లుడ్ని మెంబరుగా నెగ్గించాడు. గుమాస్తా కైలాసాన్ని పిలిచి, తతిమ్మా మెంబర్ల వుద్దేశ్యాలు ఎల్లావున్నాయో తెలుసుకురమ్మని పంపించాడు.

అప్పటికే మెంబర్లలో పట్టన్న యీసారి ప్రెసిడెంటు నిలబట్టం లేదని, అల్లుడు అబద్ధాన్ని ప్రెసిడెంటు చేయదల్చుకున్నాడని పొక్కింది.

దారిలో మెరకవీధి నాయుడు నేనెందుకు ప్రెసిడెంటుకి నిలబడకూడదు. ఆ ఆడారివాడుపాళం చెయ్యనా ? అంటున్నాడు అక్కడక్కడ.

ఈ వార్త గుమాస్తా కైలాసం పట్టన్న చెవికి చేరవేశాడు. పట్టన్న మండిపడ్డాడు.

"అదే నాకు కొడుకుండి, వాడే ప్రెసిడెంటుకి పోటీచేస్తే నాయుడుగా డీమాట అనగలడా ? తండ్రిపదవి కొడుక్కు రాకేమౌతుందిలే అని, సరిపెట్టుకొనేవాడు. వా డెరగ నేర్చుకుంటే-కూతురు మొగుడొకటి కొడుకొకటీనా? నా కిద్దరూ సమానమే. కొడుకులేడుగాబట్టి కూతురుమొగుడ్ని నా కుర్చీలో కూర్చోబెడుతున్నాను తప్పా? కాదంటే పదివేలు గుమ్మరించేనా సరే నా అల్లుడ్ని ప్రెసిడెంటు చేసి తీరతాను. ఏమనుకుంటున్నాడో నాయుడు!" అని గర్జించాడు పట్టన్న కైలాసం ముందు.

"చిత్తం. అంతేమరి" అన్నాడు కైలాసం.

అన్నప్రకారం పట్టన్న కట్టలు విరజిమ్మి కూతురు కిచ్చినమాట నిలబెట్టుకున్నాడు. అబద్ధాన్ని కైలాసం చేతుల్లోపెట్టి "జాగ్రత్తగా చూసుకో. బొత్తిగా కొత్త" అన్నాడు.

"తమరొకటి అల్లుడుగా రొకటీనా? ఎంతమాట...అన్నీ నేను చూసుకుంటాగా" అని కైలాసం హామీయిచ్చాడు.

"ముందు కాస్త సంతకం దిద్దించు. బొత్తిగా వేలిముద్రంటే బాగోదు."

"అదెంతపని నాలుగక్షరాలేగా. గంటలో వచ్చేస్తాయి" పట్టుబట్టి అబద్ధానికి సంతకం నేర్పాడు కైలాసం.

తాయారు, తండ్రి ఖద్దరుపంచి, ఖద్దరులాల్చీ, కండువా కట్టబెట్టింది అబద్ధానికి. తృప్తిగా చూసుకుంది భర్తని. ఆ డ్రస్‌లో అచ్చు ఆ ఖద్దరు బట్టలకోసం పుట్టినట్టు అగుపించాడు ఆమెకి అబద్ధం,

"రాజువెడలె రవితేజములలరగ" అన్నట్లు పగటి వేషగాడిలా మొదటిసారి పంచాయితీబోర్డు ఆఫీసుకి బయలుదేరి వెళ్ళినప్పుడు ఊళ్ళోని అమ్మలక్కలందరూ బుగ్గలు నొక్కుకున్నారు. ఒకళ్ళ ముఖాలు ఒకళ్ళు చూసి నవ్వుకున్నారు.

అలా నాలుగైదురోజులు రోజూ ఆఫీసుకి వెళ్ళడం రావడం జరిగింది అబద్ధం. ఎందుకనో యిదేమీ నచ్చలేదు అబద్ధానికి. ఇంక ఉండబట్టలేక ఓనాడు,

"ఏం కైలాసం మనపని యిట్టా ఎల్లం వత్తవేనా? ఇంకేవైనా వుందా? అసలు మనకున్న పవర్సు లేంటి? సంగతేంటి ?" అన్నాడు అబద్ధం.

"చిత్తం. తమకి బోల్డు పవర్సు వున్నాయి. ఆ మాటకొస్తే ఈ ఊరికి మీ రో చిన్న రాజనుకోండి. ఈ ఊరు మీది_ఊళ్లో రోడ్లు మీవి. స్కూలుమీది, మాష్టర్లు మీవాళ్ళు. జనం మీవాళ్ళు, ఆ మాటకొస్తే ఈ

ఊరంతా మీ సొంతమనుకోండి. ఆ తరువాత మీయిష్టం. తల్చుకుంటే ఊరుని సగం అమ్మేసినా అడిగేవాడు లేడు."

"అయితే ఊరుమీద కెడదాం పద మరి." అని లేచాడు అబద్ధం.

"అమ్మమ్మ. అంత తొందర పనికిరాదు. తొందరపడి ఊరుమీద కెడితే ఊళ్లో వుండేది జనంకదూ. వంటికి మంచిదికాదు. ఎందుకయినా మంచిది ముందు స్కూలుమీద కెడదాం పదండి. స్కూల్లో వుండేది మేకల్లాటి మాష్టర్లేగా. తేడావస్తే 'ట్రాన్సఫర్ చేయించెయ్యొచ్చు'అనిస్కూలు మీదకి తీసుకెళ్ళాడు కైలాసం క్రొత్త ప్రెసిడెంటిని.

మామగారు కాల్చే లంకపుగాకు చుట్ట సుతకొరికి ఠీవిగా ముట్టించాడు అబద్ధం. స్కూలు కాంపౌండులోకి అబద్ధం, కైలాసం అడుగు పెట్టారు. హెడ్మాస్టరు ఎదురువచ్చి, ఆహ్వానించారు కొత్త ప్రెసిడెంటుని. గ్రౌండులో నాలుగడుగులు నడిచాక హెడ్మాష్టారు ఉండబట్టలేక, చివరికి తెగించి, "చూడండి స్కూలు కాంపౌండులో మీబోటివాళ్ళు చుట్ట కాల్చకూడదు. దయచేసి పారెయ్యండి" అన్నారు. ఆ మాటల్లో ప్రతిమలాటకంటే ఆజ్ఞ ధ్వనించింది.

ఎలిమెంటరీ స్కూలుకి వెళ్ళిన నాలుగైదు నెలల్లోనే, మాస్టరంటే భయాన్ని అలవరచుకున్న అబద్ధం మారుమాటాడకుండ చుట్టని నేల మీదకి జార్చేసాడు. కాని కైలాసం అలా ఎందుకు చేసావు? అన్నట్టు పళ్ళుబిగించి కళ్ళెర్రజేసాడు. తనుచేసిన పని తప్పని అబద్ధం గ్రహించాడు.

ముగ్గురూ హెడ్మాస్టారు గదిలోకెళ్ళి ఆశీనులయ్యారు. "అయితే మాష్టారూ! నన్ను సుట్టకాల్చకూడదన్నారు. నేను సుట్టకాలిసి పొగ మాత్రం మింగుతాను. కాని మన తెలుగు మాస్టారు పొగాకుని పొడుం చేసి ముక్కుపొడుం కింద పీల్చేత్తాడు. దానికేమంటారు" అన్నాడు అబద్ధం.

"అబ్బ? పట్టన్న అల్లుడయ్యాక ఆడారి అబద్ధానికికూడ తెలివి వంటపడుతోంది అనుకున్నాడు కైలాసం. చంటివాడు కొంటె పనిచేస్తే నవ్వినట్టు నవ్వాడు కైలాసం.

తెలుగు మాస్టారు పిల్లలముందు ముక్కుపొడుం పీల్చరు. స్టాఫ్ రూములోనే పీలుస్తారు. మీరు ఈగదిలో కాల్చవచ్చుకాని పిల్లలందరికి అగుపించేలా చుట్టకాలిస్తే పిల్లలూ మిమ్మల్ని అనుసరిస్తారు. మీరు ఈ గ్రామానికి పెద్దలు గాబట్టి అందుకని అలా అన్నాను" హెడ్మాస్టారు సమాధానం యిచ్చాడు.

"సరేలెండి యిసుకూలు చూసొత్తాం. పదయ్యా కైలాసం" అని అబద్ధం లేచాడు.

"నేనూవస్తా పదండి" అన్నారు హెడ్మాస్టారు.

"వద్దులెండి. నేను సుట్టకాల్చనులెండి" అని అబద్ధం, కైలాసం బయలుదేరారు.

తిన్నగా తెలుగు మాష్టారు క్లాసుకే వెళ్ళారు. తెలుగుమాస్టారు తన్మయులై పాఠం చెబుతున్నారు. 'శకుంతలోపాఖ్యానం' పిల్లలంతా ఎంతో శ్రద్ధగా వింటున్నారు. ప్రెసిడెంటు రాకనెవరూ పట్టించుకోలేదు. అబద్ధానికికూడ పాటం బాగుంది, అలా నిలబడిపోయాడు. ఎంతసేపు శకుంతల దుష్యంతుడ్ని చూసి, ఏమనుకుంటున్నాడో అన్న విషయమే విడమర్చి, ప్రతిమాటకి అర్థం చెపుతూ, కవి చమత్కారాలను ఎత్తి చూపుతూ పాఠం చెబుతున్నారు తెలుగు మాస్టారు.

చివరికి అబద్ధానికి విసుగెత్తింది. "ఏటండి మాస్టారు? ఎంతసేపూ ఆయనన్నక్కడ యీవిడిని ఇక్కడ నిలబెట్టి కతనడపటాలేనా యిద్దర్నీ కలిపేదేవన్నావుందా? మొత్తానికి నేనెత్తేగాని కలపరేంటి? యిక సాలుగాని కలపండి, కలపండి యిద్దర్నీను" అన్నాడు అబద్ధం.

దాంతో తెలుగు మాస్టారు ఉలిక్కిపడి చిత్తం చిత్తం అంటూ శకుంతలాదుష్యంతుల్ని కలిపేసారు పాఠ్యభాగంలో లేకపోయినా.

"అద్దది అట్టావుండాలి పాటవంటే" అని పక్కనేవున్న సైన్సు క్లాసు దగ్గరకెళ్ళాడు అబద్ధం.

అక్కడ మాస్టారు ఏదో చూపెడుతూ వుంటే చుట్టూమూగారు పిల్లలు, పిల్లల్లో కలిసిపోయాడు అబద్ధంకూడ. మాస్టారు భాస్వరాన్ని

నీళ్ళలో వేశారు. ఆ భాస్వరం ముక్క నీళ్ళలో 'యిజ్' అని ధ్వనిచేస్తూ పరుగెడుతోంది.

"నీ తస్సాదియ్యా ఏమో అనుకున్నాను. కలాసులో దీపాలమాస చేసేత్తన్నావు. అందుకే కుర్రోళ్ళు నువ్వంటే పడిసత్తారు" అని అబద్ధం అండంలో సైన్సు మాస్టారు ఉలిక్కిపడి చిత్తం, చిత్తం అని నిలదొక్కుకున్నాడు, ఇంతలో ఓ కుర్రపీనుగు "ఇదిగో అబద్ధం మామయ్యా మా మాస్టారుదగ్గర గ్యాస్‌లైటుతీగ కూడా వుంది" అన్నాడు,

'అదేంటయ్యా మాస్టారు?' అన్నాడు అబద్ధం.

'అదేనండి దాన్ని మెగ్నీషయంవైర్' అంటారు.

'అంటే యేంటయ్యా కైలాసం?'

"అదేనండి. దీనమ్మకడుపుకాల నోట్లో ఆడుతోంది. ఏదండి మాస్టారు అది..." అని తడుముకుంటున్నాడు కైలాసం.

ఇంతలో ఓ కుర్రాడు 'తెల్లారితీగ' అన్నాడు.

'ఓరినీ? అదా ఎలిగించవయ్యా మాస్టారు సూదాం' అని తొందర చేసాడు ప్రెసిడెంటు అబద్ధం.

"అది పగలు వెలిగిస్తే బాగోదండి. అంత వెలుగురాదు'అన్నాడు సైన్సు మాస్టరు.

'సరే అయితే ఋంపిటికి మా యింటికట్టుకొచ్చి ఎలిగించు వత్తా' అని చెప్పి సోషల్ మాస్టరు క్లాస్‌దగ్గరకెళ్ళాడు.

సోషల్‌స్టడీస్ మాష్టారు అశోకుడు చేసిన మంచి పనులు చెబుతున్నారు, అన్నీవిన్నాడు ఈ అబద్ధం.

'ఏమయ్యా మాట్టారు. యిటాంటి పనులు మా మామమాత్రం సేయించలేదా. ఆయన పేరెప్పుడేనా సెప్పావా ? యారాకుర్రోళ్ళు పట్టన్న పేరెప్పుడేనా సెప్పాడా మీ మాస్టారు.

'లేదు, లేదు' అని అరిచారు పిల్లలు.

'అబ్బెబ్బె. చెబుతానండి మన పట్టన్నగారి పేరూవస్తుంది. వరుసలో వస్తుంది. ఆఖర్ని మన పంచాయతీ గురించి, పట్టన్నగారి గురించి,

ఆ తరువాత తమ గురించి కూడ చెబుతాను' అన్నాడు సోషల్ మాస్టారు చేతులు నలుపుతూ.

'అదిమరి. అట్టారా దారికి' అని కైలాసంవైపు చూసాడు అబద్ధం. కైలాసం శహభాష్ అన్నట్టు చిరునవ్వు విసిరాడు.

తరువాత లెక్కల మాస్టారు క్లాస్ దగ్గరకెళ్ళారు. లెక్కల మాస్టారు లెక్కొదో బోర్డుమీద వ్రాసి కూర్చున్నారు. అబద్ధం, కైలాసం నిశబ్దంగావెళ్ళి చాలా సేపు నిలబడ్డారు. మాష్టారు, క్లాసుకూడ నిశబ్దంగా వున్నారు. కొంతసేపు అలావుండి, 'ఏమయ్యా మాష్టారు! ఇదేనా లెక్క చెప్పటం?' అన్నాడు ప్రెసిడెంటు. మాస్టారులేచి, 'లెక్కయిచ్చానండి వాళ్ళు చేస్తున్నారు. వాళ్ళు చెయ్యకపోతే నేనే ఆ లెక్క బోర్డుమీదచేసి అందరికీ చూపిస్తాను' అన్నారు వినయంగా.

'గొప్ప పనిసేత్తావ్. లెక్కలు మేమూ సదువుకొన్నాం. లెక్కల క్లాసంటే ఎట్టా వుంటాదో మాకు తెలుసు. రెండురెళ్ళు నాలుగు, అయిదు రెళ్ళ పాది ఆర్రెళ్ళు పన్నెండు...అని ఒకే హోరు కింద వుండేది మే సదివుకునే రోజులో. అట్టా సెప్పాలి కాని యిట్టాకూకుంటే అళ్ళకి లెక్కలే వోత్తాయేటి? నీకు జీతం బొక్క' అని ప్రెసిడెంటు అధికారం చెలా యించాడు.

'చిత్తం. అది చిన్నక్లాసులలో చెప్పే పద్ధతి.'

'సిన్నేటి పెద్దేటి. పద్ధతంటె అందరికీ ఒకటే. ఏవయ్యా కైలాసం.

'చిత్తం అంతేమరి. ప్రెసిడెంటుగారు చెప్పినట్టే సెయ్యండి-ఇక వెడదాం పదండి' అని కైలాసం రక్షించాడు లెక్కల మాస్టార్ని.

'ఛీ యీ జిల్లా పరిషత్ చేతుల్లో విద్యపడిన తరువాత...' అని నోట్లో గొణుక్కున్నారు లెక్కల మాస్టారు.

తిన్నగా హెడ్మాష్టారు గది దగ్గరకొచ్చారు అబద్ధం, కైలాసం.

'వెడుతున్నారా?' అన్నారు హెడ్మాస్టారు.

'యడతం సంగతి సరేలే. నాకు ఈ ఊరిమీద, పార్కుమీద, బడి మీద, గుడిమీద, చెరువుమీద అధికారం వుందా లేదయ్యా' అన్నాడు అబద్ధం.

'లేదని ఎవరనగలరు. ఈ గ్రామానికి మీరు అధ్యక్షులు' అన్నారు హెడ్మాస్టారు.

'ఔనామరి. నా అంతటోడ్ని పట్టుకొని ఇక్కడ సుట్టకాల్చకూడదంటం ఏవన్నా బాగుందా? మా మావకి తెలిత్తే ఏమైపోద్దో, యెంత గొడవైపోద్దో ఆలోచించావా ?'

'స్కూలుమీద మీ కధికారం వుండొచ్చు. కాని స్కూలు లోపల నా అధికారమే చెల్లుతుంది. అప్పుడే డిసిప్లిన్ వుంటుంది. నేను పిల్లల క్షేమం దృష్ట్యా అలా చెప్పాల్సి వచ్చింది. మీరు మరోలా భావిస్తే నేనేమీ చెయ్యలేను.'

'సర్లె. అదీ సూత్తాను. ఇసుకూల్లో నీఅధికారం సంగతి. ఊళ్ళో నా అధికారం సంగతీను...' అని విసురుగా వెళ్ళిపోయాడు అబద్ధం. కైలాసం వెంటపడ్డాడు.

◆ ◆ ◆

స్కూలు వదిలేశారు. పిల్లలు మాస్టర్లు అంతా వెళ్ళిపోయారు.

ఆఖరుకి హెడ్మాస్టారు సైకిలుమీద స్కూలు నుంచి బయలుదేరారు. ఊరు చివర వంతెన దగ్గర అబద్ధం, కైలాసం నిలబడ్డారు. ఇద్దరూ వంతెన కిటూ అటూ నిలబడ్డారు. హెడ్మాస్టారు వా రిద్దరి మధ్య నుంచి వెళ్ళాలి. వాళ్ళిద్దర్నీ పట్టించుకోకుండా హెడ్మాస్టారు సైకిలు తొక్కుకుపోతున్నారు.

'ఆగండి మాట్టారు' అనరిచాడు కైలాసం.

'ఎందుకు' అంటూ దిగారు హెడ్మాస్టారు.

'యీ రోడ్డుమీద సైకిలు నడిపించుకుగాని, తొక్కుతూగాని నువ్వెల్టానికి వీల్లేదు. యీ రోడ్డునాది. నా ఇష్టం. ఇక్కడ నా రూల్సే సెల్లాలి' అబద్ధం ఆదేశించాడు.

హెడ్మాస్టారుకి నవ్వొచ్చింది. కాని నవ్వాపుకుని 'సరే. మీ మాట ప్రకారమే చేస్తాను' అని వెనక్కి వెళ్ళిపోయారు.

కొంతసేపయ్యాక, రెండెడ్ల బండిమీద సైకిలు వేసుకొని, తనూ ఎక్కి అబద్ధం, కైలాసాల మధ్యనుంచి నవ్వుకొంటూ వెళ్ళిపోయారు హెడ్మాస్టారు.

'తప్పదియ్యా! నేనే నెగ్గాను' అనుకున్నాడు అబద్ధం.

'అర్హతలేనివాళ్ళు డబ్బుతో అధికారాన్ని కొనుక్కున్నా, తెలివి ముందు తలవంచుతూనే వుంటారు, కాని అధికారం దుర్వినియోగం ఐతే చెడిపోయేది ఆ అధికారాన్ని అమ్ముకున్నవాళ్ళే?' అనుకున్నారు హెడ్మాస్టారు.